ప్రజాశక్తి

ఆదివారం 26 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



స్టీల్ కార్మికులకు

ఇఎంఐ ఇబ్బందులు

- సకాలంలో జీతాలు చెల్లించని యాజమాన్యం
- తప్పని చెక్కు బౌన్స్, లేట్ ఫీ భారాలు
- ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్ర

ప్రజాశక్తి -గాజువాక

ఎంతో ఘనకీర్తి కలిగిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నేడు కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజులు పనిచేసినా జీతం ఎప్పుడు అందుతుంతో తెలియని పరిస్థితి నెలకొంది. జీతం కోసం ధర్నాలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. జీతాలు నెల మొదటి వారంలో పడకపోవడంతో చాలా మంది కార్మికులు, అధికారులు ఇఎంఐలు కట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం కార్మికులు, అధికారులు కలిపి సుమారు 14 వేల మంది పనిచేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి జీతాలు సక్రమంగా చెల్లించడంలేదు. 20వ తేదీ తర్వాత మొదటి విడత, మిగతా సగం నెల చివరివారంలో జీతాలను చెల్లిస్తున్నారు. దీనివల్ల కార్మికులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హౌసింగ్ లోన్, వ్యక్తిగత

మిగతా 2లో..

చెక్కు బౌన్స్ ఛార్జీల భారం

జీతాలు సక్రమంగా వేయకపోవడంతో బ్యాంకు రుణాలకు ప్రతినెలా చెక్కు బౌన్స్ చార్జీలు వసూలు చేస్తున్నారు. మరో పక్క పాప డెలివరీ కోసం ఇంటికి వచ్చింది. ఆమె వైద్యం కోసం అప్పులు చేశాను. బ్యాంకు బిఐఎఫ్ఆర్‌కి వెళ్లినప్పుడు కూడా ఇంత సమస్య లేదు.



చిన్నబాబు, డిప్యూటీ మేనేజర్.

బిజెపి కుట్ర

విశాఖ స్టీల్‌ప్లాంట్ బిఐఎఫ్ఆర్‌కు వెళ్లినప్పుడు కూడా జీతాలు సకాలంలో అందాయి. హుదూద్, కరోనా సమయంలో కూడా సకాలంలో జీతాలు చెల్లించారు. ఇప్పుడు కావాలనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోంది.



ఎంవి.రమణ ఎస్ఎంఎస్ విభాగం

వడ్డీలకు అప్పులు చేస్తున్నాం

ఎండలో కష్టపడి పనిచేసి లాభాలు తీస్తున్నప్పటికీ సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. నెలలో రెండు సార్లు చొప్పున జీతాలు చెల్లిస్తున్నారు. అవసరానికి జీతం అందక అప్పులు చేయాల్సి వస్తోంది. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నాం.



ఎ.తవిటయ్య, ఇన్‌స్ట్రుమెంటేషన్ డిపార్ట్‌మెంట్

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను రోజువారీ తనిఖీలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ఉదయం పరిశీలించారు. పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, ఏడీసీ కెఎస్.విశ్వనాథన్‌లతో కలిసి పార్లమెంటు, అంసెబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన అక్కడి పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఆర్ఒలు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను వాసుపల్లి పరిశీలన

విశాఖ కలెక్టరేట్ : వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం దక్షిణ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ వ్యక్తిగతంగా పరిశీలించారు. అక్కడి పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు.



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు

అంపైర్లు, స్కోరర్ల వేతనాలు పెంపు

వార్త 4లో..

ఉక్కు ఉద్యమానికి నేటికి 1200 రోజులు

వార్త మెయిన్‌లో..

అసైన్డ్ భూములను కాజేసిన సిఎస్ : మూర్తియాదవ్

వార్త మెయిన్‌లో..

శివలింగపురం యార్డులో డిఆర్ఎం తనిఖీ

వార్త 2లో..



తులసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ యూనియన్, సిఐటియు నాయకులు

తులసి మరణం తీరని లోటు

వార్త మెయిన్ 3లో..

అందంగా, ఆకర్షణీయంగా జంక్షన్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలోని వివిధ జంక్షన్లు ఇటీవల ఎంతో అందంగా, ఆకర్షణీయంగా మారిపోయాయి. జివిఎంసి ప్రత్యేక శ్రద్ధతో వీటి నిర్మాణం చేపట్టింది. నగర పరిధిలోని 20 జంక్షన్లు, 16 రోడ్లు సుందరీకరణకు రూ.25 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈసరికే పలు జంక్షన్లను అభివృద్ధి చేశారు. కాస్మోపాలిటన్ అందాలతో రూపొందిన జంక్షన్‌లలో దక్షిణ నియోజకవర్గంలో కొన్ని ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది అల్లిపురం దరి డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మౌంటెన్ ఆ ప్రాంతానికి కొత్త అందాలను తీసుకొచ్చింది. గ్రీన్ సర్కిల్ నడుమ మూడు డాల్ఫిన్లు నీటిని బయటకు వెదజల్లుతున్నట్లు ఏర్పాటుచేసిన ప్రతిమలు అటుగా ప్రయాణించే వాహన చోదకులను, పాద చారులను ఆకట్టుకుంటున్నాయి. విశాఖపట్నం పోర్టు ముఖద్వారం వద్ద గల సిహార్స్ (సముద్రపు గుర్రాలు) ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఈ జంక్షన్లో గతంలో ఉండే సి హార్స్ ప్రతిమలు శిథిలావస్థకు చేరడంతో వాటిని పూర్తిగా తొలగించి కొత్త వాటిని ఏర్పాటుచేశారు. రౌండ్ రైలింగ్ ఏర్పాటుచేసిన సీహార్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన వైజాగ్ పోర్ట్ సింబల్ కూడా ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. గ్రీనరీ స్టీల్ రెయిలింగ్ నడుమ ఏర్పాటుచేసిన ఆ సింబల్ జ్ఞానాపురం ప్రాంతానికి సరికొత్త శోభను తీసుకొచ్చింది. రైల్వే న్యూ కాలనీలో రైలు ఇంజిన్‌తో రూపుదిద్దిన జంక్షన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది. రాత్రిపూట

మిగతా 2లో..



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో మహారాణి పార్లర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన రాజహంసల ప్రతిమలు



పోర్టు జంక్షన్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన సీ హార్స్ ప్రతిమలు

మొదటి పేజీ తరువాయి..

స్టీల్ కార్మికులకు ఇఎంఐ ఇబ్బందులు

లోన్, పిల్లల చదువుల నిమిత్తం రుణాలు, వాహన రుణాలు తదితరాలను కార్మికులు, అధికారులు బ్యాంకుల నుంచి తీసుకున్నారు. గతంలో ప్రతి నెలా ఒకటో తేదీన జీతం వచ్చేది కాబట్టి తీసుకున్న రుణాలకు 5వ తేదీ, 10వ తేదీన ఇఎంఐలు చెల్లించేందుకు తేదీలు ఖరారు చేసుకున్నారు. ఆ విధంగా చెల్లించేవారు. ప్రస్తుత ఆ తేదీలకు జీతాలు రాకపోవడంతో ఇఎంఐలు చెల్లించలేకపోతున్నారు. ఫిబ్రవరి నుంచి ఈ సమస్య రావడంతో బ్యాంకులు ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో కార్మికులు, అధికారులు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. మరోపక్క చెక్కు బౌన్స్ చార్జీ అని, లేట్ చార్జీలని అదనపు భారం కూడా బ్యాంకులు వేస్తున్నాయి. మరి కొంతమంది కార్మికులు చెక్కులు బౌన్స్ అవుతాయనే భయంతో బయట వడ్డీకి డబ్బులు తీసుకొచ్చి బ్యాంకుల్లో జమచేస్తున్నారు.

గాజువాక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఒక మహిళా అధికారి భర్త స్టీల్ ప్లాంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన జీతం సకాలంలో వచ్చే సమయంలో ప్రతి నెలా బ్యాంకు రుణాలను ఆయా తేదీలకు చెల్లించేవారు. ఏప్రిల్ నెలలో రెవెన్యూ అధికారి శాలరీ ఆలస్యం కావడం, ఆమె భర్త స్టీల్ ప్లాంట్ ఉద్యోగి జీతం కూడా ఆలస్యం కావడంతో బయట అప్పులు చేసి బ్యాంకు లోన్లు చెల్లించారు.

ఎల్ఐసి, పిఎఫ్ తదితరాల జమ నిల్

ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించకపోగా, నెట్ పే కార్మికులకు వేస్తున్నా, జీతాల నుంచి కట్ చేస్తున్న ఎల్ఐసి, పిఎఫ్, త్రిఫ్ట్ సొసైటీ, ఎస్ఎబిఎఫ్ తదితరాలను ఆయా కంపెనీలకు యాజమాన్యం చెల్లించడం లేదు. దీనివలన ఎల్ఐసిలో కార్మికుల పాలసీలు డిఫాల్ట్ అవుతున్నాయి. ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ సంబంధించిన కుటుంబాలకు చెల్లిస్తున్న బేసిక్ డిఎ కూడా ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. విద్యుత్ ఛార్జీలపై అదనపుభారాలను మోపింది. టౌన్ షిప్‌లో నివాసముంటున్న కార్మికుల దగ్గర గతంలో యూనిట్‌కు రూ.0.50 పైసలు చెప్పిన వసూలు చేసేవారు. ఇప్పుడు అదే యూనిట్‌కు రూ.8.10 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో కొత్తగా వచ్చిన కార్మికులు మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

అందంగా, ఆకర్షణీయంగా జంక్షన్లు

విద్యుత్ వెలుగులలో రైలు ఇంజిన్ అన్ని దిక్కుల వైపు తిరుగుతూ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇవి మాత్రమే కాకుండా, నగర పరిధిలోని సిరిపురం జంక్షన్ అద్భుతంగా అందంగా రూపుదిద్దబడింది. ఈ జంక్షన్‌కు వచ్చేవారు ఆ ప్రాంతంలో కుటుంబ సభ్యులతో కొంతసేపు సేద తీరే విధంగా ప్రత్యేకంగా కుర్చీలను ఏర్పాటు చేశారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని మహారాణి పార్లర్ జంక్షన్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఈ జంక్షన్‌లో రాజహంసలను అమర్చి, వాటి నోటి ద్వారా నీటిని విడిచే విధంగా ఏర్పాటుచేశారు. రాత్రి వేళ అందంగా కనిపించేందుకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం, గుడివాడ గురునాధరావు విగ్రహాల వద్ద కూడా ప్రత్యేకంగా వాటర్ ఎ.ా ం ట ౌ న్ ల ు ఏర్పాటుచేశారు. జంక్షన్ల అభివృద్ధితోపాటు, ఈ ప్రాంతంలోని రోడ్లను కూడా అవసరమైన మేరకు వెడల్పు చేసి అభివృద్ధి చేశారు. విశాలంగా ఉన్న రోడ్ల మధ్యలో డివైడర్లను, విద్యుత్ దీపాలతో సహా అందంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంతాలన్నీ కళకళలాడుతున్నాయి.



డాల్ఫిన్ జంక్షన్‌లో డాల్ఫిన్ ప్రతిమలు

'లాభాల బాటలో ఐఐఎఫ్ఎల్ హెచ్ఎఫ్ఎల్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎఫ్ వై23లో రూ. 28,512 కోట్లకు, ఎఫ్‌వై 24లో రూ.35,499 కోట్లకు, ఐఐఎఫ్ఎల్ హెరిమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తన అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం)లో వైఒవై 25 శాతం పెరిగిందని ఐఐఎఫ్ఎల్ సౌత్ జోనల్ సేల్స్ హెడ్ క్రాంత్ నమల తెలిపారు. నోవాటెల్ హోటల్ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇది సగటు టిక్కెట్ పరిమాణం రూ.14.26 లక్షలతో భారతదేశపు అతి పెద్ద సరసమైన హౌసింగ్ ఫైనాన్స్ సంస్థగా మారిందని వివరించారు. మే 6, 2024 నాటి ఎక్స్ఛేంజ్ రిపోర్టింగ్ ప్రకారం, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్స్ అథారిటీ ద్వారా 20 శాతం వాటాతో ఐఐఎఫ్ఎల్ హెరిమ్ ఫైనాన్స్, ఎఫ్‌వై 23లో రూ.2,712 కోట్ల నుంచి ఎఫ్‌వై 24లో రూ.3,317 కోట్లకు పెరిగి, 23 శాతం వైఒవై వృద్ధిని నమోదు చేసిందని వివరించారు. పన్ను తర్వాత లాభం (పీఏటీ) ఎఫ్ వై 23లో రూ.768 కోట్ల నుంచి ఎఫ్‌వై 24లో రూ.1,017 కోట్లకు 32 శాతం పెరిగిందని తెలిపారు. నికర వడ్డీ మార్జిన్లు 80 బేసిస్ పాయింట్లు మెరుగుపడ్డాయని వివరించారు.

అంతటా ఒక్కటే ఉత్కంఠ...

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

"అన్ని దారులూ రోమ్ నగరం వైపే"...అన్న మాట గుర్తుకొచ్చేలాగ ప్రజలందరి చూపూ జూన్ 4వ తేదీ వైపే.. అనడం అతిశయోక్తి కాదేమో. ప్రజా తీర్పు ఆ రోజు ఇవిఎంల నుంచి బయటకు రానుంది. మే 13న జరిగిన ఎన్నికల అనంతరం ఊహలు రెక్కలు కట్టుకుని గాలిలో విహరిస్తున్నాయనడంలో సందేహం లేదు. రాజకీయ పార్టీల్లో మరింత ఉత్కంఠ ఉండగా, ఏ పార్టీ విజయం సాధిస్తుందో? ఎక్కడ ఏ అభ్యర్థి గెలుపొందుతాడన్న చర్చలు వేగవంతంగా సాగుతున్నాయి. విశాఖలో పలు అసెంబ్లీ సెగ్మెంట్లపై ఇప్పటికే బెట్టింగులు కూడా పెద్ద ఎత్తున సాగాయి. రాజకీయ పార్టీలు, వాటి గుర్తులే కాదు ఈ ఎన్నికలను పలు అంశాలు డామినేట్ చేశాయన్నది వాస్తవం. పోటీ చేసిన అభ్యర్థి, అతను పెట్టే ఖర్చు, బరిలో ఉన్న వ్యక్తి కులం అంశాలు ఈ ఎన్నికల్లో బాగా పనిచేశాయన్నది వినిపిస్తున్న మాట. ఈ నేపథ్యంలో పోలింగ్ పూర్తయిన వారం రోజుల తర్వాత తాజాగా రోజులు లెక్కపెట్టుకుంటూ ఎన్నికల ఫలితాల కోసం జనం, ఆయా రాజకీయ పక్షాలు వేచి చూస్తున్నాయి. విశాఖ జిల్లాలో పార్లమెంట్, 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో జరిగిన పోటీ అత్యంత ఆసక్తికరంగా నిలుస్తోంది. 2019 ఎన్నికల్లో విజయావకాశాలపై ఇంత పెద్ద ఎత్తున ఊహాగానాలు లేవన్నది స్పష్టమే. అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, వైసిపి అధినేత వైఎస్.జగన్ ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ చేసిన ప్రచారం, సంక్షేమ మానిఫెస్టోతో 'ఫ్యాను గాలి' గట్టిగానే వీచిందన్నది అప్పట్లో ఎవరినడిగినా పోలింగ్ తర్వాత ఇట్టే చెప్పేసేవారు. 2024 ఎన్నికల్లో అలాంటి స్పష్టత కొరవడింది. ప్రతి నియోజకవర్గంలో ప్రతి ఓటరూ కీలకంగా మారాడు. పెద్ద ఎత్తున రూ.కోట్లు వెదజల్లే



పరిస్థితి వైఎస్ఆర్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ, బిజెపి నుంచి విశాఖలో ఉండడం, ఓటు ఓటుకూ నోటు వెళ్లిందా? లేదా? అన్న లెక్కల్లో నేటికీ అభ్యర్థులు తలమునకలై ఉన్నారు. దీంతో గెలుపోటములపై ఉత్కంఠ కొనసాగుతోంది. గాజువాక, విశాఖ పశ్చిమంలో సిపిఎం, సిపిఐ తరపున అభ్యర్థులు అసెంబ్లీకి బరిలో నిలబడగా, విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ప్రధాన పార్టీలు కాకుండా ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ నిలబడింది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి మధ్యే పలు సెగ్మెంట్లలో ప్రధాన పోటీ ఉందన్నది ఎన్నికల సరళి విధితం చేస్తోంది. విశాఖ జిల్లా ఓటింగ్ శాతం సుమారు 71శాతం దాటిపోయింది.

జూన్ 9 కోసం హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లన్నీ కిటకిట...

అధికార వైసిపి నేతలు 2024 ఎన్నికల్లో విజయం తమదేనని జూన్ 9న విశాఖ నుంచే ముఖ్యమంత్రిగా రెండోసారి జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారంటూ హడావుడి చేస్తున్న విషయం తెలిసిందే. ఆ రోజు వరకూ ఇప్పటి నుంచే నగరంలోని ప్రధాన హోటళ్లన్నింటినీ బుక్ చేసుకుని 'సిద్ధం' అంటూ చెబుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఈ పనుల్లో ఇప్పటికే బిజీ అయ్యారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ తరపున ఇటీవల గంటా శ్రీనివాసరావు ఇంట్లో ఆర్ఆర్ఆర్, సోమిరెడ్డి వంటి నేతలు జూన్ 9న చంద్రబాబు సిఎంగా ప్రమాణం చేస్తారంటూ మీడియా సమావేశంలో వెల్లడించారు. రెండు ప్రధాన పార్టీల శిబిరాల్లోనూ తమ గెలుపుపై పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం ఇవిఎంల్లో తీర్పు ఎలా ఉండబోతుందోనన్న ఉత్కంఠ, భయాందోళన వారిని కలచివేస్తోంది.

శివలింగపురం యార్డులో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం: కొత్తవలస-కిరండూల్ (కెకె) లైన్ వెంబడి కార్యాచరణ సామర్థ్యం, భద్రతా చర్యలను మెరుగుపరచడానికి శివలింగపురం స్టేషన్ యార్డ్‌లో వాల్తేరు డిఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో ఐరన్ ఓర్ రవాణా కోసం పెరుగుతున్న డిమాండ్లను తీర్చడమే లక్ష్యంగా సిగ్నలింగ్, ట్రాక్ మెరుగుదల, పాయింట్లు, క్రాస్‌ఓవర్‌లు, ఓవర్‌హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌తో సహా లే-అవుట్ సవరణలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ, కార్యాచరణ సామర్థ్యం, భద్రత చాలా ముఖ్యమైనదన్నారు. ప్రత్యేకించి కెకె లైన్ వెంబడి ఇనుప ఖనిజం రవాణా కోసం సామర్థ్యం, భద్రతను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎడిఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ విజేంద్ర కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికాం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ట్రాక్షన్) పాండి టామ్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఓపెర్ డివిజనల్ ఇంజినీర్‌తో సహా కీలక సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.



కెకె.లైన్‌లో తనిఖీ చేస్తున్న డిఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

'ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ ద్వారా ఉత్తమ క్లెయిమ్ సెటిల్‌మెంట్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : క్లెయిమ్‌ను సెటిల్ చేయడానికి తక్కువ సమయం తీసుకోవడం ద్వారా తమ జీవిత బీమా సంస్థ ఉత్తమ పనితీరు కనబరిచినట్టు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ అమిష్ బంకర్ వెల్లడించారు. శనివారం ఉదయం సిరిపురం లోని సంస్థ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ స్థిరమైన క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో ట్రాక్ రికార్డును కలిగి ఉందన్నారు. 2024 ఆర్థిక ఏడాది ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి 99.17 శాతంగా ఉందని, ఇది పరిశ్రమలో అత్యుత్తమమైనదని తెలిపారు. డెత్ క్లెయిమ్‌ను సెటిల్ చేయడానికి తీసుకున్న సగటు టర్నరౌండ్ సమయం కేవలం 1.27 రోజులుగా ఉందని వివరించారు. 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ మొత్తం రూ.1,867 కోట్లు డెత్ క్లెయిమ్‌లుగా చెల్లించిందని, 2024ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసానికి కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి 97.94 శాతం, రెండవ త్రైమాసానికి 98.14 శాతం, మూడవ త్రైమాసానికి 98.52 శాతం క్లెయిమ్‌లను సెటిల్ చేసి కంపెనీ స్థిరత్వాన్ని ప్రదర్శిస్తుందని వివరించారు.

మేక్ మై ట్రిప్ నూతన ఫీచర్ పరిచయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశపు ప్రముఖ ఆన్ లైన్ ప్రయాణ కంపెనీ మేక్ మై ట్రిప్ ద్వారా టెక్-ప్రోత్సాహక ఫీచర్‌ను అందుబాటులోకి తెస్తున్నామని మేక్ మై ట్రిప్ గ్రూప్ సీఈఓ రాజేష్ మగోవ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ రైల్వేలతో ప్రయాణ అనుభవాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా మేక్ మై ట్రిప్ ప్రతి ప్రయాణాన్ని మెరుగు పరచడానికి సాధారణ వినియోగదారుకు సమస్య కలిగించే అంశాలను పరిష్కరించడానికి నూతన సౌకర్యాలను అందిస్తున్నామని వివరించారు. కంపెనీ ప్రయాణికుల బుకింగ్ చేసుకునే సమయాన్ని పలు దశలుగా విభజించినట్లు తెలిపారు. టెక్నాలజీ ఆధారంగా పరిష్కారాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైలు టిక్కెట్‌ను బుక్ చేయడానికి సంబంధించి వినియోగదారులకు అత్యంత ముఖ్యమైన అంశాలలో నిర్ధారిత టికెట్ పొందడం ఒకటని సాధారణంగా, నిర్ధారిత టికెట్ కోసం బుకింగ్ విండో ట్రిప్‌కు ముందు 120 రోజులకు తెరవబడుతుందని వివరించారు. వేగంగా భర్తీ అవుతుందని తెలిపారు. తరచుగా ప్రయాణికులకు వెయిట్ లిస్ట్ టికెట్ లభిస్తాయని పేర్కొన్నారు.

జంతు సంరక్షణ చట్టాల నోడల్ అధికారిగా శ్యామలరావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర డిజిపి అదేశాల మేరకు విశాఖ నగరంలో జంతువులపై నేరాలు, జంతు సంరక్షణ చట్టాలను అమలు చేయడానికి నోడల్ అధికారిగా జోన్-2 ఎసిపి (క్రైమ్స్) సి హెచ్.శ్యామలరావును నియమించారు. ఆయన తన విధులలో భాగంగా విశాఖ నగరంలోని అన్ని స్టేషన్ల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, జంతు సంక్షేమ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయటంతో పాటు నగరంలో జంతువుల అక్రమ రవాణా, జంతువులను చంపడం ఆపడం, ఫుడ్ సేఫ్టీ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు చేపట్టడం వంటి విధులను నిర్వర్తిస్తారు.

జోన్-3, 5లో నేడు నీటి సరఫరా యథాతథం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగర పాలక సంస్థ జోన్-3, 5 పరిధిలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల శనివారం తాగునీరు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జివిఎంసి మంచి నీటి సరఫరా నిర్వహణ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కెవిఎన్.రవి ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి పరిధిలోని పద్మనాభపురం, పిడబ్ల్యూడి పంప్ హౌస్‌కు పద్మనాభపురం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయినందున జోన్-3, 5 పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం తాగునీటి సరఫరా యథాతథంగా ఉంటుందని తెలిపారు.



విశాఖ నగరంలో రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు సిపి ఎ.రవిశంకర్ ఆధ్వర్యాన వీల్ లాక్ కార్యక్రమాన్ని పోలీసులు చేపట్టారు

శరవేగంగా మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం

- జివిఎంసి నిధులతో ఆధునిక హంగులతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, వినియోగదారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రధాన రహదారి పక్కన దుకాణాల సముదాయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మున్సిపాలిటీ హయాంలో నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరడం,చిల్లుల పడ్డ రేకుల షెడ్ల కింద, ఎండవానల్లో అవస్థలు పడుతూ వ్యాపారాలు కొనసాగించే పరిస్థితులకు త్వరలో మోక్షం కలగనుంది. కూరగాయలు, చేపలు, మాంసం దుకాణాలు ఒకవైపు, కిరాణా, పాన్‌షాప్, బియ్యం తదితర దుకాణాలు మరోవైపు ఉండగా, అద్దెప్రాతిపదికన ఉండే ఇవి శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం కూల్చేశారు.

ఆధునిక హంగులతో కొత్త దుకాణ సముదాయం

జివిఎంసి ఆధ్వర్యంలో ఆధునిక హంగులతో కొత్త దుకాణాల సము దాయం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ముందు వరుసలో నిర్మించే 12 దుకాణాలను వేలం పాట ద్వారా



చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు



మార్కెట్ సముదాయం నమూనా భవనం

అప్పగించనున్నారు. వెనుక భాగంలో చేపలు, మాంసం విక్రయాల కోసం 10, కూరగాయాల దుకాణాలు 18 నిర్మించనున్నారు. వ్యాపారులు , వినియోగదారుల సౌకర్యార్థం తాగునీరు, రన్నింగ్ వాటర్ సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం ఇతర హంగులతో కార్పొరేట్ స్థాయిలో మార్కెట్, దుకాణాల సముదాయం రూపుదిద్దుకోనుంది. తొలి విడతలో విడుదలైన జివిఎంసి నిధులు రూ.1.50కోట్లతో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండో విడతలో మరో రూ.కోటి నిధులు అవసరం కానుంది.

తాత్కాలిక దుకాణాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మార్కెట్, దుకాణ సముదాయం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో కూరగాయలు, చేపలు, మాంసం వ్యాపారులకు స్థానిక గంటస్తంభం వద్ద ఖాళీ ప్రదేశంలో షామియానాలు, గొడుగులు వేసి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

కొత్త కాంప్లెక్స్‌తో కష్టాలు తీరుతాయి..



20 ఏళ్లగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేవు. ఎండవానల్లో తడుస్తూ వ్యాపారం చేసేవాళ్లం. కొత్తమార్కెట్ కాంప్లెక్స్‌తో కష్టాలు తీరిపోతాయి.

పంచదార్ల నరసయ్యమ్మ, కూరగాయల వ్యాపారి

సౌకర్యాలు కల్పించడం హర్షణీయం



అన్ని సౌకర్యాలతో కొత్త మార్కెట్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తుండడం హర్షణీయం. రన్నింగ్ వాటర్, విద్యుత్, తాగునీరు, ఇతర సదుపాయాల తోపాటు చేపల నిల్వ సౌకర్యం కల్పిస్తుండడం ఆనందంగా ఉంది.

కదిరి నరసమ్మ, చేపల వ్యాపారి

దొంగతనాలపై అప్రమత్తత అవసరం

- నేర విభాగం డిసిపి వెంకటరత్నం



మాట్లాడుతున్న క్రైం డిసిపి వెంకటరత్నం

ప్రజాశక్తి - ఆరిలోవ : వేసవి సెలవులు నేపథ్యంలో ఊళ్లకు వెళ్ళే వారు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని నేర విభాగం డిసిపి వెంకటరత్నం సూచించారు. విశాఖ నగర కమిషనర్ రవిశంకర్ అయ్యర్ ఆదేశాల మేరకు శనివారం ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ డిసిపి వెంకటరత్నం, ఎసిపి వెంకటరావుతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవుల నేపథ్యంలో తీర్థయాత్రలు, సొంతూళ్లు, ఇతర క్యాంపులకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాళం వేసిన ఇళ్లను చూసి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో విలువైన ఆభరణాలు, నగదును జాగ్రత్తగా భద్రపరచడంతోపాటు, తాము క్యాంపులకు వెళ్లే సమాచారాన్ని సంబంధిత పోలీసుస్టేషన్‌కు రెండు రోజుల ముందు సమాచారమిస్తే, లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ ద్వారా సిసి కెమెరాలు, ప్రత్యేక నిఘాను పోలీసులే ఏర్పాటు చేస్తారన్నారు. ఈ సిస్టమ్ ద్వారా ఎవరైనా ఇళ్ళలోకి దొంగతనానికి ప్రవేశిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్ ద్వారా పోలీసులకు అలారం ద్వారా తెలుస్తుందన్నారు. వెంటనే అప్రమత్తమై ఆ ప్రదేశానికి చేరుకుని నేరాలను నియంత్రించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేకుల షెడ్ నిర్మాణం నిలిపివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పద్మనాభం: సొంత స్థలంలో రేకుల షెడ్డు వేసుకుంటే పనులను నిలిపేయడమే కాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేసి విఆర్‌ఓ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని భీమిలి ఆర్‌డిఒకు మండలంలోని బుద్దవలస గ్రామానికి చెందిన బోను అప్పలరాజు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వేనెంబర్ 35/25 లో మూడున్నర సెంట్లు స్థలం మెట్టు భూమి తన తాత, తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా సంక్రమించిందన్నారు. దీనికి సంబంధించి పట్టాదారు పాస్‌బుక్, ఇతర ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అంటున్నాడు. అయితే కొంతమంది ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో తన సొంత స్థలంలో రేకులషెడ్ వేసుకుంటే విఆర్‌ఓ వచ్చి నిలిపేశారని ఆరోపించాడు. తన వద్దనున్న పాస్‌బుక్ ఇతర ఆధారాలు చూపినా వదలకుండా పనులకు ఆటంకం కలిగించడమే కాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఆరోపించారు. పోలీసులకు కూడా ఆధారాలను చూపించానన్నారు. తన సొంత స్థలంలో రేకులషెడ్ నిర్మాణానికి అనుమతినివ్వాలని అప్పలరాజు ఫిర్యాదులో వేడుకున్నాడు.

విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి

ప్రజాశక్తి- ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌లో భారీగా పెంచిన ఉక్కు కార్మికుల గృహ వినియోగ విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ఉక్కు గుర్తింపు యూనియన్ నేతలు డిమాండ్ చేశారు.. శనివారం ఉక్కు సెంట్రల్ స్టోర్స్ కూడలిలోని ఎఐటియుసి పాయింట్ వద్ద అధ్యక్షులు కెఎస్ఎన్ రావు అధ్యక్షతన ఉక్కు గుర్తింపు యూనియన్ కార్యవర్గ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ, నాయకులు నరేష్‌కుమార్, కె.రాజ బాబు, జి.జయ, మురళీకృష్ణ పాల్గొన్నారు .

ఉక్కు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- గాజువాక : స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ పూర్వ డైరెక్టర్ బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. శనివారం సమతా నగర్ జంక్షన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రతినెలా పూర్తి వేతనాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్మికులకు రావాల్సిన పెండింగ్ ఫుల్ అండ్ ఫైనల్ బెనిఫిట్స్ అన్నింటినీ సంబంధిత విభాగాల ద్వారా నేరుగా కాంట్రాక్టు కార్మికులకు చెల్లించేలా ఉక్కు యాజమాన్యం బాధ్యత వహించాలని కోరారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ఉక్కు శ్రామిక సంఘం యూనియన్ గౌరవాధ్యక్షులు కరణం సత్యారావు, అధ్యక్షులు ఎంకె రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రటరీ బొడ్డు రమణ పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక యోగా చైతన్య సంస్థలో బాలబాలికలకు నిర్వహించిన యోగా శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. మే 1నుంచి 10 వరకు మొదటి బ్యాచ్, మే15 నుంచి 24 వరకు రెండో బ్యాచ్‌లో 348 మంది బాలబాలికలు యోగాపై తర్ఫీదు పొందారు. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జోనల్ కమిషనర్ కె కనక మహాలక్ష్మి మాట్లాడుతూ, యోగా సాధన ద్వారా వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం సమకూరుతాయన్నారు. ఈ తరహా శిక్షణా తరగతులు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐజి కాళిదాసు వెంకటరంగారావు, జివిఎంసి ఒకటో జోన్ ఎసిపి డి శ్రీనివాసరావు, డి.నాగిరెడ్డి,ఎం రాంబాబు, సిహెచ్ వెంకట రమణ పాల్గొన్నారు

ఫోన్‌పే చెల్లింపులతోనే మద్యం!

కొత్త నిబంధనతో గందరగోళం : వైన్‌షాపుల దగ్గర మందుబాబుల గగ్గోలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రభుత్వ వైన్ షాపుల వద్ద మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. ఇన్నాళ్లు డబ్బులు ఇస్తేనే మద్యం విక్రయించే విధానానికి శుక్రవారం నుంచి ప్రభుత్వం చరమగీతం పలికింది. తాజాగా ఫోన్‌పే చేస్తేనే మద్యం ఇస్తామని వైన్‌షాప్ నిర్వాహకులు చెప్పడంతో మందుబాబుల్లో గందరగోళం ఏర్పడింది. చాలామంది మందుబాబులకు స్మార్ట్‌ఫోన్స్, వాటిల్లో ఫోన్‌పే సౌకర్యం లేదు. దీంతో వారికి ప్రభుత్వం మద్యం దుకాణాల్లో మందు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఎప్పటిలాగానే తాము డబ్బులు ఇస్తే మద్యం ఇవ్వకపోవడంతో వైన్‌షాపుల్లోని సిబ్బందితో మందుబాబులు వాగ్వివాదానికి దిగుతున్నారు. సాయంకాలం పని పూర్తి చేసుకుని, శరీర కష్టం నుంచి ఉపశమనానికి మద్యం తాగే అలవాటున్న వారంతా, క్వార్టర్ మందు కోసం క్యూలైన్‌లో నిలబడితే, లేనిపోని నిబంధనలు పెట్టి మందు లేదనేసరికి వారంతా చిర్రెత్తిపోతున్నారు. ఫోన్‌పే కొట్టు, మద్యం బాటిల్ పట్టు అంటూ కొత్త విధానాన్ని మద్యం దుకాణాల సిబ్బంది చెప్పేసరికి మొదట్లో ఖంగుతిన్న మందుబాబులు, తర్వాత ఎక్కడలేని కోపాన్ని తెచ్చి చిందులేస్తున్నారు. అయితే తామేమీ చేయలేమని, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఫోన్‌పే చేస్తేనే మందు ఇస్తామని లేకుంటే లేదని చేతులెత్తేయడంతో వైన్ షాపుల దగ్గర మందుబాబులు గగ్గోలు పెట్టారు.మద్యం అలవాటు ఉండి, ఫోన్‌పే సదుపాయం లేని వారంతా ఏం చేయాలో తెలియక తలలు పట్టుకున్నారు. మొత్తానికి శనివారం నుంచి కొత్తగా అమల్లోకి వచ్చిన మద్యం అమ్మకాల విధానంతో మందుబాబులకు ఏంచేయాలో పాలుపోని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి ఎన్నాళ్లో అని అంటున్నారు.

టిడ్కో ఇళ్లను ఎప్పుడిస్తారో..!

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పద్మనాభపురంలో నిర్మించిన 656 టిడ్కో ఇళ్ల నేటికీ లబ్ధిదారులకు అందని పరిస్థితి ఉంది. టిడిపి ప్రభుత్వ హయాంలో వీటిని నిర్మించడంతోపాటు అప్పట్లోనే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కూడా చేపట్టారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వాలు మారడం, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదేళ్లగా వీటిని పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులకు పంపిణీ చేయని పరిస్థితి నెలకొంది. దీంతో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు అద్దెఇళ్లల్లో ఐదేళ్లగా కాలం వెళ్లదీస్తూ, తమపేరిట మంజూరైన టిడ్కో ఇళ్ల ఎప్పుడిస్తారా అంటూ ఎదురుచూస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు కేవలం మూడు రోజుల ముందు గృహప్రవేశాలంటూ వైసిపి నేతలు హడావిడి చేసినా, వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ తంతు అక్కడితో ఆగిపోయింది. టిడిపి హయాంలో నిర్మించారన్న ఒకేఒక్క కారణంతో ఐదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన టిడ్కో ఇళ్లను



పద్మనాభపురంలోని టిడ్కో గృహ సముదాయం

వైసిపి ప్రభుత్వం కావాలనే తమకు పంపిణీ చేయలేదని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల తంతు ముగిసినప్పటికీ, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై దృష్టి పెట్టేందుకు మరికొన్నాళ్ల సమయం తీసుకునే 1పరిస్థితి ఉన్నందున ఎప్పటికి తమకు అందుతాయోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రాయితీ ధరపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాల్లో వేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. ప్రభుత్వపరంగా సగం రాయితీ ధరపై తమ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో రైతులు వీటిని పొందవచ్చన్నారు. ఈ మేరకు మండలంలో 16.2 క్వింటాళ్ల జీలుగు, 7.5 క్వింటాళ్ల జనుము, 3.60 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుకు, జనుము విత్తనాలు కిలో ధర రూ.88 కాగా, సగం రాయితీ ధరపై కిలో రూ.44లకు పొందవచ్చన్నారు. అలాగే పిల్లిపెసర కిలో రూ.134కాగా, సగం రాయితీ పోను రూ.67లకే పొందవచ్చన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు తమ దగ్గరలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి, ధర చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పచ్చి రొట్ట విత్తనాల సాగుతో భూసారం పెరుగుతుందన్నారు.

సాగర గణపతి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యాన శని వారం స్థానిక సాగర గణపతి ఆలయం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. మత్స్యకారుల ఇలవేల్పు పోలమాంబ ఆలయం ప్రాంగణంలో సాగర గణపతి ఆలయాన్ని ఏడాది క్రితం నిర్మించారు.ఆలయ తొలి వార్షికోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు

గాజువాక ఎంవిఆర్ కళాశాలలో
27న క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- గాజువాక: ఈనెల 27న సోమవారం గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. దివీస్ ల్యాబొరేటరీ కంపెనీలో ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఉద్యోగాలకు కంపెనీ ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారన్నారు ట్రైనీ సూపర్‌వైజర్ పోస్టులకు బిఎస్‌సి కెమిస్ట్రీ, బి ఫార్మసీ, బిటెక్ కెమిస్ట్రీ అర్హత కలిగి ఉండాలని, అలాగే, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ పోస్టులకు ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ(క్యూఎ, ఆర్ఎ) అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. 2020-23 విద్యాసంవత్సరంలో పాసైనవారు, ప్రస్తుతం ఫైనలియర్ చదువుతున్న ఆసక్తి గల అభ్యర్థుల బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం కాలేజీలో నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ బాలకృష్ణ సూచించారు.

సెల్‌టవర్ నిర్మాణం వద్దు



డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న పరదేశీపాలెం వాసులు

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఉక్కు కర్మాగారం సమీపంలోని పరదేశీపాలెంలో జరుగుతున్న సెల్ టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను అతని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సెల్‌టవర్ నిర్మాణంతో రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని గ్రామస్తులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో దాని నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని వేడుకున్నారు. దీనిపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్పందిస్తూ, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

'పసిడి' రంగు ఆకుల చెట్టు

ప్రజాశక్తి - ఆరిలోవ :జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ చివరి ప్రధాన రహదారి పక్కన ఒక చెట్టు ఆకులన్నీ బంగారం రంగులో పసిడి పూసినట్టు ఆకర్షణీయంగా ఉండడంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఏటా ఇదే సీజన్‌లో ఈ చెట్టుకు ఇదే మాదిరిగా ఆకులన్నీ పసిడిపూత రంగులో కనిపించడంతో అటువైపు వెళ్ళే ప్రయాణికులు, పాదచారులు ఆ చెట్టు కింద నిలబడి సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.



ఆరిలోవ కాలనీలో ఆకట్టుకుంటున్న చెట్టు

బాసర విద్యార్థిని లావణ్య ప్రతిభ

ప్రజాశక్తి- తగరపువలస: 2021-24 విద్యాసంవత్సరానికి ఆంధ్రవిశ్వ విద్యాలయం డిగ్రీ పరీక్షల ర్యాంకులను శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో స్థానిక శ్రీ బాసర డిగ్రీ కళాశాల బికాం విద్యార్థిని బత్తుల లావణ్య కంప్యూటర్ గ్రూప్‌లో విశ్వ విద్యాలయం స్థాయిలో మూడవ ర్యాంకు సాధించినట్లు బాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ తెలిపారు.జివిఎంసి నాలుగో వార్డు ఉప్పాడ సమీపంలోని గంగడపాలేనికి చెందిన లావణ్య ప్రతిభను బాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్, ప్రిన్సిపల్ సురేష్, ఎఒ కేశవ్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు



బత్తుల లావణ్య

నిర్లక్ష్యంతో నిరుపయోగం!

- అధ్వానస్థితికి వివేకానంద కల్యాణ మండపం
- మందుబాబులు, అసాంఘిక చర్యలకు నెలవు
- ఆందోళన చెందుతున్న నక్కవానిపాలెం వాసులు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు



నిరుపయోగంగా ఉన్న నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి యంత్రాంగం నిర్లక్ష్యంతో 24వవార్డు నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం, ఫంక్షన్ హాల్ నిరుపయోగంగా మారింది. కోవిడ్ ముందు వరకు ఈ కల్యాణ మండపంలో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించేవారు. రూ.10వేలు నుంచి రూ.14 వేలు వరకు తక్కువ అద్దెకు ఫంక్షన్ హాల్ పేదలకు అందుబాటులో ఉండగా, దీని నిర్వహణ ద్వారా జివిఎంసికి ఆదాయం కూడా సమకూరేది. అయితే కరోనా ప్రబలిన నాటి నుంచి దీన్ని అద్దెకు ఇవ్వకపోవగా, నిర్వహణను కూడా పట్టించుకోవడం మానేశారు. దీంతో నేడు అధ్వానస్థితికి చేరుకోకవడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

నాలుగైదేళ్లుగా వివేకానంద కల్యాణమండపం బాగోగులు చూసే దిక్కు లేకపోవడంతో దీని ప్రవేశద్వారం దెబ్బతింది. ఫంక్షన్ హాల్ లోపల, అవరణలోనూ అధ్వానంగా తయారైంది. వినియోగంలో లేకపోవడంతో దీనిపైపు ఎవరూ కన్నెత్తి చూడని పరిస్థితుల్లో పగటి పూట మందుబాబులకు, గంజాయి తాగేవారికి అడ్డాగా మారగా, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నాయి. ఆకతాయిలు, మందుబాబులకు హల్‌చల్ చేనస్తుండడంతో అటుగా



ఫంక్షన్ హాల్ ముందు పూడుకుపోయిన కాలువ



ప్రవేశద్వారం వద్ద శిథిలమైన కల్వర్టు

వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు.

సామాన్య మధ్య తరగతి కుటుంబాలకు, చిన్న కార్యక్రమాలు చేసుకునే వారికి తక్కువ అద్దెతో అందుబాటులో ఉండే వివేకానంద కల్యాణమండపం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారంతా అంటున్నారు. ఈప్రాంతంలో ఏదైనా కార్యక్రమం చేయాలంటే అనువైన స్థలం లేక అవస్థలు పడుతున్నామని అంటున్నారు. ఈ నేపథ్యంలో వివేకానంద కల్యాణమండపానికి చిన్నపాటి మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తెస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగామారి, అసాంఘిక చర్యలకు నెలవుగా మారిన వివేకానంద కల్యాణమండపం వల్ల తాము పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టి, దీన్ని వినియోగంలోకి తేవాలని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా జివిఎంసి యంత్రాంగం స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దీనిపై వైసిపికి చెందిన24వ వార్డు కార్పొరేటర్ తాడి పద్మారెడ్డి వివరణ కోరగా, వివేకానంద కల్యాణమండపం వినియోగంలో లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులపై స్థానికులు పలుమార్లు తన దృష్టికి తెచ్చారన్నారు. దీనిపై పోలీసు కమిషనర్, జివిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, తగు చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. అయితే ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టి, వివేకానంద కల్యాణమండపాన్ని ఆధునికీకరించాలని కోరుతున్నారు.

పనిముట్లు లేకుండా పారిశుధ్య పనులు ఎలా..?

- చెత్త సేకరణకు నిత్యం అవస్థలు
- జివిఎంసి పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- వేపగుంట : సరైన పనిముట్లు ఇవ్వకుండా పారిశుధ్య పనులు చేయాలని జివిఎంసి 92వ వార్డు శానిటేషన్ అధికారి, కాంట్రాక్టు సూపర్‌వైజర్లు తమను వేధిస్తున్నారని శనివారం ఆ వార్డు పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నెలరోజులుగా సరైన పనిముట్లు ఇచ్చిన దాఖలాలు లేవని వాపోతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణకు సరైన డబ్బాలు, పారలు ఇవ్వకపోవడంతో చిల్లులు పడిన డబ్బాలను పట్టుకుని చేతులతో చెత్తను సేకరించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో చేతుల నిండా మురుగుమయం కావడంతోపాటు చిల్లులు పడిన డబ్బాలు నుంచి మురుగంతా కారి శరీరంపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. అంతేకాక వీధుల్లో పనులు చేయనీయకుండా, తమతో గెడ్డలలో పూడికలు తీయాలని, మెయిన్‌రోడ్డు శుభ్రపరచాలని వేధిస్తున్నారన్నారు. దీంతో అటు వార్డు వీధుల్లో పనులు చేయడం లేదని ప్రజలు చీత్కరించు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెత్త సేకరణకు ఇచ్చిన చిల్లులు పడిన డబ్బాలు

అపరిశుభ్రతా పరిస్థితుల మధ్య శానిటేషన్ అధికారి, అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ల వేధింపులకు గురవుతూ తాము పారిశుధ్య పనులు చేస్తున్నా, అటు ప్రజల్లో తాము పనులు చేయనట్టే అవుతోందని అంటున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అంపైరు, స్కోరర్ల వేతనాల పెంపు

- ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం.పాలెం : విధి నిర్వహణలో అంకితభావం, కృషి, నైపుణ్యాన్ని గుర్తించి అంపైర్, స్కోరర్లతోపాటు ఇతర మ్యాచ్ అఫిషియల్స్ వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. పెంచిన వేతనాలు ఈ నెల 25వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయన్నారు. వేతనాల పెంపువల్ల మ్యాచ్ అధికారుల ఆర్థిక శ్రేయస్సును పెంపొందిం చడమే కాకుండా క్రీడా ఈవెంట్ల మెరుగైన నిర్వహణకు దోహదపడతాయన్నారు. నాలుగేళ్ల తర్వాత అంపైర్లు, స్కోరర్ల వేతనాలు పెంచుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకోవడంపై మ్యాచ్ అఫిషియల్స్ సంతోషం వ్యక్తం చేశారు. ఎసిఎ అధ్యక్ష, కార్యదర్శులు పి.శరత్‌చంద్రారెడ్డి, ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెంచిన వేతనాల ప్రకారం జిల్లా, జోనల్ స్థాయి అంపైర్లకు రోజుకు రూ.1,500 నుంచి రూ. 2,500, స్కోరర్లకు రూ.800 నుంచి రూ.1,500లకు వేతనం పెంచారు. టోర్నమెంట్ ఆర్గనైజ్ చేస్తే అంపైర్లకు రూ.2 వేల నుంచి రూ. 3 వేలు, స్కోరర్లకు రూ. వెయ్యి నుంచి రూ.2 వేలు, అదేవిధంగా డెయిలీ అలవెన్స్ కూడా పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

ఎంపిఎల్ విజేత ఎండాడ హెచ్‌సిఎ

- రన్నరప్‌గా మధురవాడ రాక్‌స్టార్స్
- ముగిసిన మధురవాడ ప్రీమియర్ లీగ్ క్రికెట్
- విజేతలకు అట్టహాసంగా బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -పిఎం పాలెం: మధురవాడ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధురవాడ యువత, బైపిల్లి ప్రసాద్ పర్యవేక్షణలో వారం రోజులుగా నిర్వహించిన మధురవాడ ప్రీమియర్ లీగ్ (ఎంపిఎల్) క్రికెట్ పోటీలు శనివారం ఘనంగా ముగిసాయి. ఎనిమిది జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఎండాడ హెచ్‌సిఎ లెవెన్ జట్టు విజేతగా నిలవగా, రన్నరప్‌గా మధురవాడ రాక్‌స్టార్స్ జట్టు నిలిచింది. శనివారం సాయంత్రం మధురవాడ క్రికెట్ స్టేడియం 'బి' మైదానంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను ఎబి.గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ స్వరూప్, నక్కా శ్రీధర్, పిల్లా సత్యనారాయణ ప్రదానం చేశారు

. టైటిల్ విజేత, రన్నరప్ జట్లుతోపాటు ఎండాడ హెచ్‌సిఎ జట్టు తరుపున ఆల్‌రౌండ్ ప్రదర్శన జరిపి, టోర్నీలో 378 పరుగులు, పది వికెట్లు సాధించిన పోతిరెడ్డి వెంకరటావుకు ఉత్తమ బ్యాట్స్‌మెన్,మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును, అలాగే టోర్నీలో 16 వికెట్లు సాధించిన అనిల్‌కుమార్‌కు బెస్ట్ బౌలర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిఎల్ అధ్యక్షులు వాండ్రాసి రవికుమార్, కెవిఆర్ ఈవెంట్స్ గురునాథ్, కనకదుర్గ ఈవెంట్స్ కొర్రాయి సురేష్, ఆనంద్ ఎడ్యుకేషన్ అకాడమీ పోతిన అప్పలరాజు, జగ్గుపిల్లి నరేష్, మామిడి దుర్గారావు, పసుపులేటి రామచలం పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉపాధి హామీ పనులు కల్పించాలని ధర్నా

పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి -అచ్యుతాపురం

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని, గతేడాది చేసిన పనులకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ సచివాలయ ఆవరణలో సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు ధర్నా నిర్వహించారు. పనులు చేస్తామంటే ప్రభుత్వం పని కల్పించలేని పరిస్థితిలో ఉందని, చేసిన పనికి బకాయిలు అడిగిన కాలయాపన చేస్తున్నారని, అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఉపాధి హామీ పనులు కల్పించరూ..' శీర్షికన ప్రజాశక్తి వార్త ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా సంఘాల ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు మాట్లాడుతూ తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించకపోవడంతో పేదలు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని కల్పించకపోతే భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే తిమ్మరాజుపేట గ్రామంలో పనులు ప్రారంభించాలన్నారు. పెదపాడు, తిమ్మరాజుపేటలో గత సంవత్సరం మూడు నుండి ఏడు వారాల పాటు చేసిన పనులకు కూలి సొమ్ము ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. వెంటనే బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తిమ్మరాజుపేట సచివాలయ కార్యదర్శి జీనబందుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఎస్ దేవుడు, పి అప్పలనర్స, జి లక్ష్మి, పి.నూక రత్నం, వేములపూడి జువాలు, సరగడం నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


తిమ్మరాజు పేట గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలని స్థానిక ఇఒపిఆర్‌డి ఒ.మహేష్ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శనివారం కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉద్యోగులు నిమగ్నం కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరుపై ఎటువంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలకు పలు సూచనలు అందించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సబ్బవరం మేజర్ పంచాయతీలో డ్రైనేజీ సమస్య ఉందని, దీన్ని పంచాయతీ పాలకవర్గంతో చర్చించి పరిష్కరించాలని ఆ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కె.మూర్తి బాబు, బ్రహ్మ, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందారు. స్థానిక సీఐ శంకర్రావు అందించిన వివరాలు ప్రకారం... ఈనెల 24న అనకాపల్లి దరి దేవీనగర్‌కు చెందిన వెదురుపర్తి బాల శంకర్ ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో జారి పడ్డారు. ఆయన సోదరుడు నాగ వీర వెంకట సత్యనారాయణ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ సిఐ శంకర్రావు, ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది కలిసి తుమ్మపాల వద్ద సెర్చ్ ఆపరేషన్ చేయగా ఏలూరు కాలవలో బాలశంకర్ మృతదేహం లభ్యమైంది. అనకాపల్లి పట్టణ సిఐ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో డివిఎల్ విద్యార్థినికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్ర యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాలలో స్థానిక దాడి వీరునాయుడు కళాశాలకు చెందిన పెంటకోట అనురాధ విశ్వవిద్యాలయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు అనురాధను శనివారం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ గతంలో కూడా అనేకమంది తమ కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయ, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయా మాధురి, అధ్యాపకులు పాల్గొన్నారు.


అనురాధను అభినందిస్తున్న రత్నాకర్

'4న వైసిపి పాలనకు తెర'

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్రంలో వైసిపి అహంకార, అరాచక హింసాత్మక పాలనకు జూన్ 4వ తేదీన తెరపడుతుందని శాసనమండలి మాజీ సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. టిడిపి అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి స్పష్టమైన మెజారిటీతో గెలవబోతుందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారని చెప్పారు. ఇప్పటికీ కొంతమంది అధికారులు జగన్ సేవలో తరించాలని తపన పడుతున్నారని, వారందరి పైన బేషరతుగా చర్యలు ఉంటాయని నాగ జగదీష్ హెచ్చరించారు. సంక్షేమం నన్ను కాపాడుతుందని చెప్పిన పెద్దమనిషి, వైసిపి అభ్యర్థులను హింసకు ప్రేరేపించడం, పోలీసులు ఆర్వోలు, ఎలక్షన్స్ సిబ్బందిని బెదిరించి, ప్రత్యర్థ పార్టీల ఏజెంట్లపై దాడులు చేసి, వారిపై హత్యాయత్నం చేయడం దారుణమన్నారు. రాష్ట్రం అల్లకల్లోలం అవుతుంటే లండన్ నగరంలో విహారయాత్ర చేస్తూ నాటి నీరు చక్రవర్తిని తలపిస్తున్నాడని మండిపడ్డారు.

బస్ షెల్టర్‌ను కమ్మేస్తున్న బొగ్గు బూడిద


- నిరుపయోగంగా మారిన వైనం
- పట్టించుకొనే నాథుడే కరువు
- చెట్ల నీడనే ప్రయాణికుల నిరీక్షణ

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండల కార్యాలయాల సముదాయం కూడలిలో ప్రధాన రహదారిలో ఉన్న బస్ షెల్టరును బొగ్గు బూడిద కమ్మేస్తుంది. దీంతో ప్రయాణికులు వేచి ఉండటానికి అవకాశం లేకపోవడంతో ఈ బస్ షెల్టర్ నిరుపయోగంగా పడి ఉంది. పరవాడ ఫార్మా సిటీలోని మైలాన్ ఫార్మా కంపెనీ సిఎస్ఆర్ నిధులతో 8 సంవత్సరాల క్రితం సుందరంగా ఈ బస్సు షెల్టర్‌ను నిర్మించింది. ఈ కూడలిలో తహశీల్దారు, ఎంపిడిఒ, ఎంఈఓ కార్యాలయాలు, పశువుల ఆసుపత్రి, వ్యవసాయ శాఖ, హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయాలు, పోస్ట్ ఆఫీస్, డ్వాక్రా ఆఫీసు, భవిత ఆఫీసు ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ బస్సు షెల్టర్ అవసరమని గుర్తించి మైలాన్ ఫార్మా కంపెనీ దీనిని నిర్మించింది. ఈ కూడలి మీదుగా రాత్రి, పగలు అనే తేడాలేకుండా బొగ్గు లారీలు వెలుతుండడంతో బొగ్గు బూడిద రోడ్డుపై పడి ఆ బూడిద బస్సు షెల్టర్‌ను కమ్మేస్తుంది. బొగ్గు బూడిద, దుమ్మూధూలి బస్ షెల్టర్‌పైనా, లోపల, చుట్టూ ఉన్న ప్రదేశాల్లోనూ పేరుకుపోతుంది. దీంతో ఈ బస్సు షెల్టర్‌లో కూర్చోడానికి, నిలబడటానికి వీల్లేకుండా ఉంది. ఆ బూడిద మసితో బట్టలన్నీ పాడైపోతండటంతో ప్రయాణికులు పక్కన ఉన్న చెట్లు వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఈ రోడ్డు కార్నర్‌లో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బొగ్గు లారీల నుండి పెద్ద మొత్తంలో బొగ్గు కింద పడుతుంది. ఈ బొగ్గు, ధూలి బస్సు షెల్టర్ ఆవరణ పేరుకుపోతున్నా బొగ్గు లారీల యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈ బస్సు షెల్టర్ చుట్టూ అపరిశుభ్రత, తుప్పలు పేరుకుపోవడంతో ఇది ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. బస్ షెల్టర్లకు ఏళ్ల తరబడి నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. బస్ షెల్టరు నిరుపయోగంగా ఉన్నా ఈ ప్రాంతంలో ఉన్న కార్యాలయాల అధికారులుగాని, పంచాయతీ అధికారులుగాని పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బొగ్గు లారీల నుండి వచ్చే బూడిదను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బస్సు షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.


దుమ్మూధూళితో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్


నియామక పత్రాలు అందజేస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఉద్యోగ విజయోత్సవం నిర్వహించారు. 2023-24 విద్య సంవత్సరంలో ప్రముఖ కంపెనీలు థాట్ వర్క్స్, టెక్నిక్స్, హెచ్ఎల్ మెండో కంప్యూటర్స్, టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్, మాస్ చెఫ్, డైకిన్, స్ట్రక్చరల్ సొల్యూషన్స్, హెచ్ఎల్ మెండో, మేథో సర్వో డ్రైవ్, ఇన్స్ట్రుమెంటేషన్ అండ్ ఆటోమేషన్ సొల్యూషన్స్, వీల్స్ ఇండియా ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలకు మొత్తం 76 మంది ఎంపికయ్యారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఎన్నో విజయాలు సాధించవచ్చన్నారు. అనంతరం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డివి రమణ, వివిధ శాఖాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.


కాలువ పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఉపాధి హామీ ద్వారా పంట కాలువల పూడికతీత

ప్రజాశక్తి-దేవరాపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దేవరాపల్లి రెవెన్యూ పరిధిలోని పంట కాలువల పూడికతీత పనులు శనివారం ఉపాధి హామీ కూలీలు చేపట్టారు. ఇరిగేషన్ కాలువ నుంచి కొల్లివానిపాలెం వరకు, ఉయ్యాల చింతగడ్డ నుంచి వడ్డిచింతల వారి కల్లాల వరకు, పైడమ్మ చెరువు నుంచి కర్రివాని చెరువు వరకు వ్యవసాయ భూములకు నీరు వెళ్లే విధంగా కాలువలు పూడిక తీత, తుప్పలు తొలగింపు పనులు చేశారు. దీంతో పంటలకు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా వస్తుందని రైతులు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

సర్వీసు ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా సర్వీసతోటర్ల నుండి వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను తీసుకొని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. 25వ తేదీ వరకు 1262 సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ అందుకోవడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు.


స్ట్రాంగ్ రూమ్‌కు తాళాలు వేస్తున్న దృశ్యం

కొణతాల, పీలాను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కశింకోట : మాజీ మంత్రి, అనకాపల్లి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణను, మాజీ శాసనసభ్యులు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణను శనివారం మండలానికి చెందిన టిడిపి నాయకులు కలిశారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, సోమవారం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి ఆధ్వర్యాన అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు గొంతిన చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ఉలింగల రమేష్, మాజీ సర్పంచ్‌లు కర్రి దుర్గినాయుడు, సిద్ది రెడ్డి శ్రీను, జెర్రిపోతుల నూకునాయుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ ఆంధ్రా ప్రసాద్, కర్రి సత్యనారాయణ కలగా గోవింద, తెరపల్లి శ్రీను, దుద్దేటి శ్రీను, అల్లు సాయి, నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సంస్థల మండల సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో శ్రీసత్యసాయి సేవాసంస్థల మండల సమావేశం శనివారం జరిగింది. ఇందులో సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అక్టోబరు నెల 23, 24, 25 తేదీలలో జరుగబోయే పర్తియాత్ర ఏర్పాట్లు గురించి, మండలంలో గ్రామ సేవలు, ఆధ్యాత్మిక సమావేశాలు, భజనలు, బాలవికాస తరగతులు తదితర అంశాలను గురించి తెలియజేశారు. సేవా సంస్థల దేవరాపల్లి మండల అధ్యక్షులుగా ఆదిరెడ్డి కన్నబాబును నూతనంగా నియమించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్లు, నౌడు అప్పారావు, గంధం సూర్యం, రమామణి, సిహెచ్‌వి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని ఎంపిపి స్కూల్‌ను అనకాపల్లి జిల్లా డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ శనివారం సందర్శించి విద్యా కానుక కింది విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులపై ఆరా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో గల అంగన్వాడి కేంద్రాన్ని, శాఖా గ్రంధాలయాన్ని సందర్శించారు. ఆమె వెంట ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, బిఎస్ఎన్ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జార్జ్ క్లబ్ యోగ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో యోగపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పతంజలి యోగాసమితి భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఒకటే సరైన మార్గమని, శ్వాసపై ధ్యాస సంబంధిత ప్రాణాయాలతో ఎన్నో రోగాలను తగ్గించడం యోగతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో జార్జి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్ఎంకె జోగి నాయుడు, బుద్ద కాశీ విశ్వనాథ్, వి చంద్రశేఖర్, జి మంగయ్య, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, 100 మంది యోగ సాధకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ శ్రీవేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ముగింపు సందర్భంగా చోడవరం సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం, కార్మికులు, శ్రీవారి భక్తులు సహాయ సహకారాలతో శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. దీనిని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఆఫీస్ మేనేజరు శ్రీనివాసరాజు, వర్మ, నాగేశ్వరరావు, మురళి ప్రకాశరావు, కార్మిక నాయకులు భాస్కరరావు, నాని బాబు, బండి శ్రీను, దుమ్ము రమణ, నూకరాజు, పెంటారావు, ఆలయం ఇన్చార్జి రామకృష్ణరాజు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ, భక్త మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. సుమారుగా 2,500 మంది అన్నదానంలో పాల్గొన్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఎన్నికల ఫలితాలు రోజున ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎన్నికల ఫలితాలు రోజున గ్రామాలలో ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కెవి మురళీకృష్ణ హెచ్చరించారు. అచ్యుతాపురంలో శనివారం ఎలమంచిలి నియోజకవర్గస్థాయి ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలతో అవగాహన సమావేశ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు సహకరించిన విధంగానే ఫలితాలు రోజున సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని, ఎన్నికల ఫలితాల అనంతరం వరకు రాష్ట్రంలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ఆవేశపూరితమైన, ఉద్రేకమైన వాతావరణ కల్పించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలలో ఒకసారి కేసు నమోదైతే 30 సంవత్సరాల పాటు ఆ కేసు కొనసాగుతుందన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల కోసం గ్రామాల్లో కలిసిమెలిసి ఐక్యతగా జీవనం సాగించే వారి మధ్యలో ఎటువంటి కక్షలు కార్పణ్యాలు లేకుండా కలిసిమెలిసి కొనసాగాలని సూచించారు. ఎన్నికల లెక్కింపు రోజున ఏజెంట్లుగా వచ్చేవారు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. పెన్ను కాగితం తామే ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సిఐలు ఎం బుచ్చిరాజు, షేక్ గఫూర్, ట్రాఫిక్ సిఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి ఆవు వితరణ



జగ్గారావు భార్యకు ఆవును అందిస్తున్న బాలు, వీరు యాదవ్

ప్రజాశక్తి - కశింకోట

మండల కేంద్రం కశింకోట గవర వీధికి చెందిన కౌలురైతు పొలమరశెట్టి జగ్గారావు (42) గతేడాది ఆత్మహత్య చేసుకోగా, ఆ కుటుంబానికి ప్రజా సంఘాల ప్రతినిధులు సహకారం అందించారు. వ్యవసాయ పెట్టుబడులకు చేసిన అప్పులు కారణంగా 2023 జూన్ 28న జగ్గారావు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంతవరకు ఆ కుటుంబానికి ప్రభుత్వం నుండి అందాల్సిన ఆర్థిక సహకారం అందలేదు. స్థానిక అధికార యంత్రాంగం నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఒక పక్క అప్పులిచ్చిన వారి నుండి ఒత్తిడి, మరోపక్క జీవనాన్ని కొనసాగించడం కష్టంగా ఆ కుటుంబానికి ఉంది. ఈ పరిస్థితులను అర్థం చేసుకుని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ గాడి బాలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ కలిసి మృతుడు జగ్గారావు భార్య పొలమరశెట్టి పార్వతికి ఆవును కొనుగోలు చేసి శనివారం అందజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే రూ.7 లక్షలు ఆర్థిక సహాయాన్ని త్వరితగతిన జగ్గారావు కుటుంబానికి అందజేయాలని సంఘాల ప్రతినిధులు గాడి బాలు, పాత్రపల్లి వీరు యాదవ్ కోరారు.


30న ఆలయాల భూములకు కౌలు వేలం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలోని మూడు దేవాలయాల భూములను మూడేళ్ల పాటు కౌలు చేసుకోవడానికి ఈనెల 30న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జూన్ 1 నుండి 2027 మే 31వ తేదీ వరకు వేలం దక్కించుకున్న కౌలు రైతులు సాగు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన వడ్డాదిలో సర్వేనెంబర్ 176-5లో 5.50 ఎకరాలు, 176-5ఎలో 1.50 ఎకరాలకు సంబంధించి ఎకరానికి రూ.10 వేలు చొప్పున ధరావత్తు ముందుగా చెల్లించి 30 తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు. మల్లికార్జున స్వామి ఆలయానికి చెందిన వడ్డాది సర్వే నెంబర్ 37-16లో 3.42 ఎకరాలు, 37-17లో 4.44 ఎకరాలకు సంబంధించి ఎకరానికి రూ.2 వేలు చొప్పున ధరవత్తు చెల్లించి ఆలయం వద్ద 30న మధ్యాహ్నం 12 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు. వడ్డాది రామ లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన విజయరామరాజుపేట రెవెన్యూ సర్వేనెంబర్ లో 4-21లో 2.63 ఎకరాలకు సంబంధించి ఎకరానికి రూ.2 వేలు చొప్పున ధరావత్తు చెల్లించి 30న ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు. ఆ రోజు వేలంలో పాట పాడిన వారు మొదటి సంవత్సరం సొమ్ము అదే రోజు దేవస్థానాలకు చెల్లించాలని ఈవో స్పష్టం చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి -మునగపాక

మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మండపాటి సత్యనారాయణ (77) శనివారం మరణించారు. 1971లో మునగపాక జెడ్పీ స్కూల్లో ఉపాధ్యాయునిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన తరువాత లాలం కోడూరు, సీలేరు, ఆవ సోమవారం తదితర గ్రామాలలో విధులు నిర్వహించి, అచ్యుతాపురం మండలంలోని ఎం జగన్నాధపురం స్కూల్లో 2006లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పాఠాలు బోధించడంతో పాటుగా స్కౌట్ కూడా నేర్పించేవారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా స్కూల్ విద్యార్థులకు స్కౌట్ నేర్పించేందుకు తన సమయాన్ని వెచ్చించారు. క్రమశిక్షణ గల ఉపాధ్యాయునిగా విద్యార్థుల నుండి సహోపాధ్యాయుల వరకు ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యనారాయణకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృత దేహాన్ని పలువురు పూర్వ విద్యార్థులు, అభిమానులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

రేపు పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్-ఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, ఈనెల 31 నుంచి జూన్ 5 వరకు ఆప్షన్స్ ఎక్సర్సైజ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. సీట్లు అలాట్మెంట్ అనంతరం జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. హెల్ప్ లైన్ సెంటర్‌గా అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వ్యవహరిస్తుందని శ్రీనివాసరావు తెలిపారు.

జగన్‌కు ఇవే ఆఖరి ఎన్నికలు

ప్రజాశక్తి - అనకాపల్లి

రాష్ట్రంలో అరాచక పాలన, విధ్వంసం, దోపిడీ పాలన సాగించిన జగన్మోహన్ రెడ్డికి ఇవే ఆఖరి ఎన్నికలని టిడిపి పార్లమెంటరీ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణకి మతిభ్రమించి వైసిపి 175 సీట్లు గెలుస్తుందని, జూన్ 9వ తేదీన విశాఖపట్నంలో ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారని, ఇప్పటికే విశాఖలో 5000 ప్రైవేట్ గదులు రిజర్వేషన్ చేశామని చెప్పడం శోచనీయమన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన ఎన్నికల కమిషన్ బాధ్యత వహించవలసి ఉంటుందని స్పష్టం చేశారు. డిజిపి, జిల్లాలో ఎన్నికల అధికారులు, జిల్లా పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో కోట్ని రాంబాబు, వేగి వెంకటరావు పాల్గొన్నారు.

స్టంట్ మెన్ బద్రి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మెగా ఫాన్స్, బద్రి ఫ్యాన్స్, గొంతిన శివశంకర్ ఆధ్వర్యంలో శనివారం స్టంట్ మెన్ బద్రి జన్మదిన సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గాంధీ నగర్‌లో ఉన్న సత్య సాయిబాబా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బద్రి జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, కుమార్, బాల, కరణం సత్తిబాబు, బాదం సతీష్, కోయిలాడ గంగాధర్, అనంత్, అర్జున్, గోవింద్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు పంచకర్ల దంపతులు పూజ

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని దేవీపురంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని, ఆరిపాక పంచాయతీలో శ్రీభువనేశ్వరి మాత అమ్మవారిని పెందుర్తి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు దంపతులు శనివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు బర్లికాన బాబురావు, పడాల వెంకటరమణ, మామిడి శంకర్రావు, గొర్లె నూకరాజు, వనం సత్యనారాయణ, ఇందల వెంకటరమణ, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, శరగడం ఝాన్సీలక్ష్మి రాణి రాము, దాడి లావణ్య కన్నం నాయుడు, కర్రి కనకరాజు, దొడ్డి సూర్య ప్రకాష్, దొడ్డి రాజకోటి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పెందుర్తి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు దంపతులు

అపారిశుధ్యంతో అవస్థలు

-రహదారులపైనే మురుగునీరు
-భరించరాని దుర్గంధం-అస్తవ్యస్తంగా డ్రెయినేజీ
-ఇదీ ఏఎల్ పురం గ్రామస్తుల దుస్థితి



మురుగునీటిని దాటి వెళుతున్న వాహనదారుడు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో పారిశుద్యం అధ్వాన్నంగా మారింది. రహదారులపై మురుగునీరు ఏరులై పారుతోంది. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తోంది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా పాదచారులు, వాహన చోదకులు పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. ఏఎల్ పురం బీసీ కాలనీ, హైస్కూల్ రోడ్డు, ఎస్సీ కాలనీ, గొల్లపేట, ఎస్టీ కాలనీలో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఈ మురుగునీరు మధ్యలో నుంచే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీల్లో మరుగునీరు నిల్వలతో దోమల వ్యాప్తి చెందటంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది.



ఇంటి ఆవాసం వద్ద నిలిచిన మురుగునీరు

ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ పాలకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధులే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. సుమారు 20వేల మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో పది మంది పారిశుద్య కార్మికులే పని చేస్తున్నారు. పంచాయతీలో రెండు వేల ఇళ్లు ఉండగా ఏడాదికి సుమారు రూ.15లక్షలు ఇంటి పన్నులు వస్తుంటాయి. ఇటువంటి పంచాయతీలో పారిశుద్యం దారుణంగా ఉన్నా ఎవరూ పట్టించుకోక పోవడం సరికాదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు సమీపాన నిలిచిన మురుగునీరు

ఉత్సాహంగా విద్యార్థులకు పోటీలు

-గ్రంథాలయాల్లో కొనసాగిన వేసవి శిబిరాలు



కోటవురట్లలో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి-భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం. ఆట, పాటల పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కథలు, పుస్తక పఠనం, పరుగు పందెంపోటీలు నిర్వహించారుఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి ఎస్ మహేష్, విశ్రాంత ఉద్యోగి ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం కథలు చదవడం, రాయడం, చెప్పడం, అనంతరం విద్యార్థులకు మెడిటేషన్ క్లాస్ నిర్వహించారు. జూనియర్స్ సీనియర్స్ గ్రూపులుగా సరదాగా పాసింగ్ బాల్ గేమ్ ఆడించారు. రిషిక, పార్థు, మోహినుద్దీన్, జ్యోతి రాజు విజేతలుగా నిలిచారుగ్రంథాలయాధికారిని బి సూర్యకళ మాట్లాడుతూవేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిసోర్స్ పర్సన్‌గా రిటైర్డ్ టీచర్ ధనుంజయ్, అభివద్ధి కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ పాల్గొన్నారు.

ములగాడ : గ్రంథాలయాలలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాలతో చిన్నారులకు నూతన విషయాలు తెలుస్తాయని, కొత్త ఆలోచనలు వెల్లివిరుస్తాయని రచయిత, జర్నలిస్టు కొడిగంటి నరసింహం అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం సందర్శించారు. విజ్ఞాన శిబిరాలలో పాల్గొన్న చిన్నారులకు పఠనాసక్తి, భాషా పరిజ్ఞానం, ఉపన్యాస కళ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, నూతన వ్యక్తుల పరిచయాల వల్ల ఆత్మీయ బంధాలు ఏర్పడతాయన్నారు. చిత్రకారులు ఎస్. చలపతిరావు మాట్లాడుతూ - పుస్తకాలను క్రమం తప్పకుండా చదవడం వల్ల సాహిత్యం, కళలు, సామాజిక, ఆర్థిక,రాజకీయ రంగాలు, పరిశోధనల పట్ల ఆసక్తి , అవగాహన పెరుగుతుందన్నారు. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో యోగ, ఎక్సర్సైజ్‌లను సాధన చేశారు. గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, రచయిత కె.సత్తిరాజు , యూత్ లీడర్ జాన్ పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి శిబిరాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పుస్తక పఠనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం అలవర్చుకుని, మేధస్సుకు పెంపొందించుకోవాలన్నారు.విద్యార్థులతో నీతి కథలు, ఇంగ్లీష్ గ్రామర్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించారు. విద్యార్థులు ఈ కార్యక్రమానికి ప్రతిరోజు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెందుర్తిలో...

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాల యాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలు

డిఇఒ వెంకటలక్ష్మమ్మ



పిల్లలతో డిఇఒ

ప్రజాశక్తి-సబ్బవరం:గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని శనివారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. దీని వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులు చేసిన క్రాఫ్ట్ పెయింటింగ్‌ను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, బిఎస్ఎన్ మూర్తి, గ్రంథాలయాధికారి వి.శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రత్నం

సాఫీగా మండల సమావేశం

-ఎన్నికల కోడ్‌తో చేపట్టని చర్చలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ రత్నం అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి చర్చలు జరపకుండా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు లేవనెత్తకుండానే సమావేశం ప్రారంభించి, వెంటనే ముగించారు. ఈ సమావేశానికి అంతంత మాత్రంగానే ఎంపిటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఏవో సీతారామరాజు, ఈపిఓపి ఆర్‌డి సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-రావికమతం: రావికమతం మండలంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన నాయకులు గంజి శ్రీనివాసరావు, టి.సూరిబాబు, రామసూరి తదితరులు కోరారు. అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం అసెంబ్లీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజులను మర్యాద పూర్వకంగా కలిసి వారి దృష్టికి ఈ సమ్యలను తీసుకు వెళ్లారు. ప్రధానంగా జూనియర్ కాలేజీ, వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

మావోయిస్టుల డంప్ లభ్యం

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలోని జి.కె. వీధి మండలం గాలికొండ పంచాయితీ సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి పనసలబంద గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో ఈనెల 24న మావోయిస్టు డంప్ పోలీసులకు లభ్యమయింది. శనివారం వీటి వివరాలను స్థానిక ఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వివరించారు. కూంబింగ్ చేస్తున్న పోలీసు పార్టీలను హతమార్చాలనే ఉద్దేశ్యంతో నిషేధిత మావోయిస్టు పార్టీ సీనియర్ కేడర్ పెట్టిన డంపుగా గుర్తించి దీనిని వెలికి తీశారు. ఇందులో లభించిన వస్తువుల్లో మందుపాత్రలు, పేలుడు పదార్థాలు, ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మావోయిస్టు పార్టీ భావజాలంతో కూడిన విప్లవ సాహిత్యం ఉన్నాయి. ఈ ప్రేలుడు పదార్థాలు మావోయిస్టులకు ఎలా లభించాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాలలో ఆధారాలకు గాలింపు నిర్వహిస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న డంప్‌లో ఆరు స్టీల్ క్యారేజ్ మందుపాత్రలు, రెండు డైరెక్షనల్ మైన్స్, కిలో పేలుడు పదార్థం, 150 మీటర్ల పొడవు ఎలక్ట్రికల్ వైరు, 5 కిలోల మేకులు, ఇనుప నట్లు, మావోయిస్ట్ సాహిత్య పత్రాలు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి తుహీన్ సిన్హా, చింతపల్లి అదనపు ఎస్పి ప్రతాప్ శివకిషోర్ శనివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అల్లూరి జిల్లా పరిధిలో మావోయిస్టుల డంప్‌లన్నింటినీ అతి త్వరలో గుర్తిస్తామన్నారు. గిరిజన ప్రజలు మావోయిస్టు పార్టీకి దూరంగా ఉండి, వారి కుట్రపూరిత ప్రణాళికలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. యువతీ యువకులు గిరిజన ప్రాంత అభివృద్ధికి పాటు పడాలని విజ్ఞప్తి చేసారు.



డంప్‌లో లభ్యమైన సామగ్రి

రాజ్యాంగాన్ని మార్చే హక్కు బిజెపికి ఎవరిచ్చారు

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు - పాడేరులో పార్టీ శ్రేణులతో గెట్ టు గెదర్

ప్రజాశక్తి పాడేరు: దేశంలో 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు ప్రకటనలు చేస్తున్నారని, రాజ్యాంగాన్ని మార్చే హక్కు ఎవరిచ్చారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనరసను గెలిపించాలని ప్రచారానికి సహకరించిన వారితో సిపిఎం మండల కార్యదర్శి ఎల్.సుందరావు అధ్యక్షతన శనివారం పాడేరు విఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ శ్రేణులతో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజ్యాంగం జోలికొస్తే ఆదివాసీ, దళిత, మైనార్టీ వర్గాలు బీజేపీని పుట్టగతులు లేకుండా చేస్తారని హెచ్చరించారు. దేశంలో మత విద్వేషాలు పెచ్చురిల్లి పోతోందని మణిపూర్ ఘటన మనకళ్లముందే కనబడుతుందన్నారు. రేపు ఇదే పరిస్థితి ఏజెన్సీ ప్రాంతంలో వస్తుందని, అందుకే ఆరెస్సెస్‌ని ఏజెన్సీకి రానీయకూడదని పిలుపునిచ్చారు. జిఒ 3 రద్దయి మూడేళ్లు అవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరణ చేయడంలో విఫలం చెందాయన్నారు. అరకు పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎంపై బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేసారని మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ మోడీకి సానుకూలంగా వ్యవహరిస్తున్న తీరు స్పష్టం అయ్యిందని విమర్శించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో గతం కంటే ధనప్రవాహం పెరిగిందని, బీజేపీ పాలిత మోడీ, అమిత్ షా సొంత రాష్ట్రంలోనే ఎన్నికల ఖర్చు, డ్రగ్స్ మాఫియాగా మారిందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. పోలింగ్ బూత్‌లో పిన్నెల్లి విధ్వంసకాండ ఇందుకు నిదర్శనమని తెలిపారు. మోడీ గ్యారంటీ అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, గిరిజన యూనివర్సిటీలకు మోడీ గ్యారంటీ లేకుండా చేశారని విమర్శించారు. జిఒ 3 రద్దు, కాఫీ, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేవని ఇదే నా మోడీ గ్యారంటీ అన్ని మండిపడ్డారు. ఏపీని భ్రష్టు పట్టించిన బీజేపీతో టీడీపీ కూటమి, వైసీపీ అంటకాగడం సిగ్గు చేటన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహాం ఇవ్వకుండా ప్యాకేజి ప్రకటించకుండా బీజేపీ, వైసీపీలు మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పోలవరం పునరావాస బాధితులకు నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేసారు. ఆదివాసీ మాతృ భాష విద్యా వాలంటీర్లను జూన్ 12 నాటికి రెన్యువల్ చేయాలని, జీతాలు పెంచి, రెగ్యులర్ చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన ఆదివాసీ మాతృ భాష విద్యా వాలంటీర్ పాంగి కేశవరావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, సురేంద్ర, ఎంపీ అభ్యర్థి అప్పలనరస, సిపిఎం జిల్లా నాయకులు బోనంగి చిన్నయపడాల్, ఉమామహేశ్వరావు, హైమావతి , రామారావు, లక్కు, త్రినాధ్, పార్టీ అభిమానులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

డిగ్రీ ఫలితాల్లో స్పేసెస్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ 2024 డిగ్రీ ఫలితాలలో సత్తా చాటారు. ఈ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న కే.జయంతి అనకాపల్లి జిల్లాలో మొదట ర్యాంకు, బీబీఏ చదువుతున్న బి.తేజశ్రీ రెండవ ర్యాంకు సాధించారు. తమ డిగ్రీ కళాశాలలో అనుభవిజ్ఞులైన ఫాకల్టీ, అత్యుత్తమమైన విద్యా విధానంతో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు.


తేజశ్రీ, జయంతి


చెక్కును అందజేస్తున్న పాత్రికేయులు

పాత్రికేయుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన నర్సీపట్నం ప్రజాశక్తి రిపోర్టర్ అప్పారావు కుటుంబానికి ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ తరఫున శనివారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బేరా బాబ్జి, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపిఇఎంజెఎ) రాష్ట్ర కార్యదర్శి కిషోర్ చింతల, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపియుడబ్ల్యూజె) ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు సీహెచ్‌బీఎల్.స్వామి, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు మడ్డు రామకృష్ణ, పాత్రికేయులు పాల్గొన్నారు.

అరకులో మంత్రి జోగి రమేష్ పర్యటన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకు ఏజెన్సీ ప్రకృతి అందాలు అమోఘమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. మండలంలోని అంజోడ పైనరీ, చాపరాయి జలవిహారి అందాలను కుటుంబ సమేతంగా మంత్రి జోగి రమేష్ అరకు అందాలను శనివారం తిలకించారు. చాపరాయి అందాలను తిలకించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అరకు అందాలు దేశానికే మణిహారంగా నిలుస్తున్నాయని చెప్పారు. చల్లని గాలుల మధ్య పచ్చని కొండలు, లోయలు, జలపాతాలు కనువిందు చేస్తున్నాయన్నారు. గతంలో చాపరాయిలో సందర్శించానని అప్పట్లో ఇంత అభివృద్ధి లేదన్నారు. ప్రస్తుతం చాపరాయి జలవిహారిలో పచ్చని గార్డెన్ తో పాటు పర్యాటకులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. అరకు అందాలు మన్యానికే సొంతమని ఆయన కొనియాడారు.

కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు

వేర్వేరుగా ప్రవేశాలు ఉండాలి

ప్రజాశక్తి-పాడేరు: కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లకు వేర్వేరుగా ప్రవేశాలు ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఏజంట్లు కౌంటింగ్ టేబుల్స్ వద్దకు వెళ్లకుండా వారికి కేటాయించిన స్థలంలోనే ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. స్ట్రాంగ్ రూముల తనిఖీలో భాగంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్ ను పరిశీలించారు. పోలింగ్ ఏజంట్లకు ఏర్పాటు చేస్తున్న ఐరన్ మెస్ పనులు పూర్తి చేసి, సిసి కెమెరాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ప్రతి హాలులో 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రదేశంలోను అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో అరకు వ్యాలీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య, డిఆర్ఓ బి.పద్మావతి, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ ఎం రాజు, డిఇఇ అనుదీప్, పలువురు తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

-నర్సీపట్నం రూరల్ సిఐ హరి -గ్రామాల్లో అవగాహన సదస్సులు

ప్రజాశక్తి-గొలుగొండ: ఎన్నికల కోడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని నర్సీపట్నం రూరల్ సీఐ హరి సూచించారు. గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎస్సై కృష్ణారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి కౌంటింగ్ పూర్తయి ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంలో గ్రామాల్లో డీజే సౌండ్స్, ఊరేగింపులు, బాణా సంచా ర్యాలీలు నిషేధమన్నారు. నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. నాయకులు పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు సమన్వయంతో ఉండాలని సూచించారు.
: ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ సమయమనం పాటిస్తూ గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు వెళ్లకూడదని నర్సీపట్నం రూరల్ సీఐ హరి అన్నారు. మండలంలో కేడీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోద్యం, లింగంపేట గ్రామాల్లో ప్రజలకు శనివారం రాత్రి కౌన్సిలింగ్ సదస్సులు నిర్వహించారు. కౌంటింగ్ రోజున ఫలితాలు వెలువడిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, డీజే, మందు గుండు సామగ్రి కాల్చడం నిషేధమన్నారు. గ్రామాల్లో ఎటువంటి వివాదాలు తలెత్తినా వాటికి కారణమైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేడీపేట ఎస్సై ఉపేంద్ర, గొలుగొండ ఎస్సై కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ హరి


బురదమయంగా ఉన్న రోడ్డు

చినుకుపడితే చిత్తడే..

-వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ: చినుకుపడితే గ్రామీణ ప్రాంత రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. గొలుగొండ మండలం ఏఎల్ పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణదేవిపేట తదతర గ్రామాల్లో సీసీ, తారురోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. దీనికి తోడు రహదారులపై చాలా చోట్ల గోతలు పడటంతో అందులో వర్షపు నీరు చేరుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాతకృష్ణదేవిపేట, పల్లావూరు, రామచంద్రపురం, కొంగసింగి, ఏఎల్ పురం, లింగంపేట తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రయాణమంటేనే వర్షాలు కురిసినప్పుడు ప్రయాణికులు హడలి పోతున్నారు. రాత్రివేళ రోడ్లపై గోతలు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేక పలువురు చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలని వాహనదారులు కోరుతున్నారు.